క్లుప్తంగా

నర్సరీ పరిశీలన



మహాముత్తారం: మండల కేంద్రంలో ఈజీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్ శుక్రవారం పరిశీలించారు. నర్సరీలో ఏర్పాటు చేసిన వివిధ రకాల మొక్కలను పరిశీలించి కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ ప్రసాద్, టీఏ వెంకటేష్, రాజ్‌కుమార్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వంశీరాజ్



మహాముత్తారం: కాంగ్రెస్ యూత్ మండలాధ్యక్షుడిగా మండలంలోని ప్రేమ్‌నగర్ గ్రామానికి చెందిన జాటోత్ వంశీరాజ్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియామక పత్రాన్ని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అందజేశారు. తన యామకానికి సహకరించిన మండలంలోని నాయకులకు వంశిరాజ్ ధన్యావాదాలు తెలిపారు.

పరామర్శ



మహాముత్తారం: మండలంలోని కొర్లకుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మహాముత్తారం మండల పర్యటనకు వచ్చిన పెద్దపల్లి జిల్లా జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సంఘటన స్థలానికి చేరుకొని పరామర్శించి రోడ్డు ప్రమాదానికి గల కారనాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండలంలోని బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

డోజర్ ట్రాక్టర్లు సీజ్



మహాముత్తారం: చెట్లను తొలగించి దున్నతున్న డోజర్ ట్రాక్టర్లను శుక్రవారం సీజ్ చేసినట్లు పెగడపల్లి రేంజ్‌ఆఫీసర్ స్వాతి తెలిపారు. రేంజ్ ఆఫీసర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి రేంజ్ పరిధిలోని బోర్లగూడెం ఈస్ట్ బీట్‌లోని రిజర్వు ఫారెస్ట్‌లో రెండు డోజర్ ట్రాక్టర్లతో చెట్లను తొలగించి దున్నతున్నట్లు సమాచారం మేరకు సంఘటన స్థలానికి మహాముత్తారం పోలీసుల సహకారంతో వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలో రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ హుస్సేన్, ఎఫ్‌బీఓ ఆసీఫ్, రేంజ్ అటవీశాఖ అధికారులు ఉన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

టేకుమట్ల(రేగొండ): జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రేగొండ మండలంలోని పెద్దంపల్లిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దంపల్లి గ్రామానికి చెందిన బొద్దుల చిన్నసమ్మయ్య(60) అనే వృద్ధుడు వృద్ధాప్యంతో పాటు, అనారోగ్యంతో బాధపడుతూ నేను చనిపోతానని పలుమార్లు కుటుంబ సభ్యులకు చెప్పేవాడు. కుటుంబ సభ్యులు సైతం ధైర్యం చెప్పారని, కనీసం వ్యక్తిగత పనులు సైతం చేసుకోలేక జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి గ్రామ సమీపంలోని అతడి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కాగా మృతుడి కుమారుడు సదయ్య ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..



మహాదేవపూర్: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాదేవపూర్‌కు చెందిన సుల్తాన్ నాగరాజు (26) రెండు సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా అతిగా మద్యం తాగడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో భార్య, తల్లి మందలించడంతో అర్ధరాత్రి ఇట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుల్తాన్ కృపా గ్రేస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు.

పొడిదుక్కిలో విత్తనాలు నాటొద్దు!

- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు
- ముందస్తుగా విత్తనాలు వేస్తున్న రైతులు



రేగొండలో పొడి దుక్కిలో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళా రైతు

టేకుమట్ల: పొడిదుక్కిలో విత్తనాలు నాటొద్దని వ్యవసాయ అధికారులు చూచిస్తున్నారు. మే మాసం నుంచి జూన్ రెండవ వారంలో సైతం వాతావరణ ఉష్ణోగ్రత 40 నుంచి 46 డిగ్రీలు నమోదు అవుతున్నాయి. దీంతో నేలలో ఉష్ణోగ్రత స్థాయి సైతం ఎక్కువగానే ఉంది. కానీ రైతులు దుక్కులను సిద్ధం చేసుకుని ముందస్తుగా పత్తి విత్తనాలను నాటుతున్నారు. మృగశిర మాసంలో వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో రైతులు ముందస్తుగా విత్తనాలను నాటుకుని పనులు ముగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉష్ణోగ్రత చల్లబడకుండానే విత్తనాలను పెడితే ఎండ వేడికి విత్తనాలు మొలకెత్తే స్వభావాన్ని కోల్పోతుందని, మొదటి వర్షాలకు మొలకెత్తే అవకాశం తక్కువ ఉండడంతో పాటు, మొలకెత్తినవి కూడా ఎదిగే అవకాశం తక్కువగానే ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. దాంతో ఆర్థిక భారం పెరగడంతో పాటు, సమయం వృథా అవుతుందని నిపుణులు అంటున్నారు.

విత్తనాలను ఎప్పుడు విత్తాలి?

60 శాతం వర్షపాతం నమోదైన తర్వాత వాతావరణంలో తేమ శాతం పెరగడంతో పాటు, భూమి సైతం తడిగా మారుతుంది. కనీసం ఒక అడుగుకు పైగా నేల తడిగా ఉన్నప్పుడు మాత్రమే విత్తనాలను విత్తుకుంటే ఆరోగ్యవంతమైన మొలకలు వస్తాయని, వచ్చిన మొలకలు సైతం ఎదుగుతాయని అధికారులు సూచిస్తున్నారు. నేలలో ఉష్ణోగ్రత శాతం తగ్గకుండానే విత్తనాలను విత్తరాదని, దాని వల్ల రైతుకు నష్టాలే మిగులుతాయని, కావున విత్తనాలకు సరైన తడినేల వచ్చే వరకు వేచి ఉండాలని సూచిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



పొడి దుక్కిలో విత్తనాలు నాటితే తొలకరి వర్షాలకు విత్తనాలు మొకెత్తవని, పూర్తిస్థాయిలో వర్షాలు కురిసినప్పుడు మాత్రమే విత్తనాలు మొలకెత్తుతాయని నవయుగ సొసైటీ, ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్‌పీయూ ఆధ్వర్యంలో రేగొండ మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. పూర్తిస్థాయిలో విత్తనాలు మొలకెత్తాలంటే 60శాతం వర్షపాతం నమోదైన తర్వాతనే విత్తనాలు నాటాలి.

- అక్కల రమేష్, ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్‌పీయూ మేనేజర్ రేగొండ

రైతులకు సూచిస్తున్నాం..



భూమిలో వేడి తగ్గకముందే పొడి దుక్కిలో విత్తనాలు విత్తరాదని రైతులకు సూచిస్తున్నాం. పొడి దుక్కిలో విత్తనాలు విత్తితే మొదటి వర్షాలకు పూర్తిస్థాయిలో మొలకెత్తవు, మొలకెత్తిన బతకవు. కనీసం 60శాతం వర్షపాతం నమోదైన తర్వాతనే విత్తనాలను విత్తాలి. అప్పుడు పూర్తిస్థాయిలో విత్తనాలు మొలకెత్తుతాయి. రైతులు తొందరపడి ముందస్తుగా విత్తనాలు వేయొద్దు.

- శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి. టేకుమట్ల

భానుడి భగభగ

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడదెబ్బ తగిలే అవకాశం



ఎండకు సోడాబండి వద్ద నిమ్మరసం తాగుతున్న ప్రజలు

మొగుళ్లపల్లి: భానుడి భగభగకు ప్రజలు విలవిలలాడిపోతున్నారు. బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఎండలో తిరగడం వల్ల డీహైడ్రేషన్‌తో ప్రాణాపాయ స్థితికి చేరుకునే అవకాశం లేకపోలేదు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రతీ ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎక్కువ శాతం మంది ప్రజలు ఎండను సైతం లెక్కచేయకుండా తమ తమ పనులను ఎండలోనే కానిస్తున్నారు. ఎండలో తిరిగితే డీహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ తగలడంతో శరీరంలో ఉష్ణోగ్రత పెరగడం మూలంగా జ్వరం బారిన పడే అవకాశం ఉంది. ఎండల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కలుషిత ఆహారంతో డయేరియా..

కలుషిత నీరు ఆహారం వలన డయేరియా ప్రబలే ప్రమాదం ఉంటుంది. వాంతులు విరోచనాలు ఎక్కువ కావడంతో నీరసించి పోతారు. డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లుగానీ, ఉప్పు, పంచాదర కలిపిన నీరు తాగాలి. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఎక్కువగా నీరు తాగాలి
- నిలువ ఉన్న ఆహారాన్ని తినకూడదు.
- ద్విచక్రవాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలి.
- ఉప్పు కలిపిన ద్రావణాన్ని తీసుకోవడం ఉత్తమం.
- తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి.
- పండ్లను ఎక్కువగా తీసుకుంటే ఎంతో మేలు.
- వీలైనంత మేరకు ఎండలో తిరడగం మానుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉంది. వీలైనంతగా తమ పనులను ఉదయం పూట గానీ సాయంత్రం సమయాల్లో గానీ చేసుకోవాలి. ఆహరం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పాటిస్తూ ఉప్పు కలిపిన మజ్జిగ, గంజి వంటి ద్రావణాలు తీసుకోవాలి. ఆహారంలో ఒక పండు ఉండే విధంగా చూసుకోవాలి.

- డాక్టర్ నాగరాణి, వైద్యాధికారి, మొగుళ్లపల్లి

అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు



సీమంతాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం ఆజంనగర్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం గర్భిణులకు సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ సునీత హాజరై సీమంతాలు చేశారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు స్వర్ణలత, స్వప్న, రవళి, లక్ష్మి, జయలక్ష్మి, నర్సక్కలు గర్భిణులకు, బాలింతలు, పిల్లల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతిజ్ఞ చేయించారు. చిరుధాన్యాల వంటకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సుగుణ, లక్ష్మి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

దేవస్థాన పాలకమండలి సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఈఓ, చైర్మన్, ధర్మకర్తలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయం పాలక మండలి సమావేశాన్ని చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఈఓ మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. దేవస్థానంలో జరుగు నిత్య అన్నదానం 50మంది నుంచి 100మందికి పెంచారు. దీపదూ నైవేద్యాలు, ముఖ్య పండగలు పూజాసామాగ్రిల దిట్టం ఆమోదించుట, దేవస్థానానికి వచ్చే భక్తులకు ప్రతి రోజు ఉచిత ప్రసాదం పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రూ.1000 అభిషేకం టిక్కట్లుపై భక్తులకు రెండు లడ్డూ ప్రసాదం ఇవ్వడం, శ్రీపార్వతీ, శ్రీసరస్వతీ అమ్మవార్లకు నిత్యం బాలభోగము నివేదన చేయటంపై తీర్మనం చేశారు. దేవస్థానంలో గర్భాలయంలో అభిషేకం చేయు భక్తులు సాంప్రదాయ దుస్తులతో అభిషేకం చేయుట, పంచ, లుంగీ, మహిళలు చీర, పంజాబీ డ్రస్, చూడీదార్ ధరించాలని, దేవస్థానంలో శిథిలావస్థలో ఉన్న పాత భవనాలను తొలగించాలని ధర్మకర్తలతో చర్చి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో మెంబర్ త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, దర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, ఆరెల్లి సత్యనారాయణ, ప్రశాంత్‌రెడ్డి, కలికోట దేవెందర్, అనంతులు రమేష్‌బాబు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో 'ఆదాయం బాగు..అరకొర అన్నదానం'అనే శీర్షికన ఏప్రిల్ 24న సాక్షిలో ప్రచురితమైన కథనానికి పాలకవర్గం స్పందించింది. ఈ మేరకు శుక్రవారం పాలక మండలి సమావేశంలో తీర్మానం చేస్తూ ప్రతి రోజు 50 మంది నుంచి 100మందికి పెంచుతూ ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో సాక్షికి పలువురు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

12నుంచి అవగాహన

కాటారం: పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్లు ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అడ్మిషన్ కౌన్సిలింగ్ ప్రక్రియపై కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో పాలిసెట్ క్వాలిఫై అయిన విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ గోవర్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, తెలంగాణలోని అన్ని కళాశాలలు, కోర్సుల గురించి, ఆన్‌లైన్ అప్షన్లు ఇచ్చుట, అలాట్మెంట్ విషయాలపై నిపుణులైన అధ్యాపకులతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అవగాహన పొందడం ద్వారా ఉత్తమ కళాశాలలో సీటు సాధించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని ఏకైక కాటారం పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఈసీఈ, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ రెండింటికి ఎన్‌బీఏ, ఐఎస్ఓ గుర్తింపు ఉందని తెలిపారు. మరిన్ని అధ్యాపకుల సెల్ నంబర్లు 9949286817, 996620572, 9704052257లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

మండల సమావేశం వాయిదా

మహాముత్తారం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంది. కాని సమావేశానికి మెజారిటీ సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ సుభద్ర ప్రకటించారు. ఈ సమావేశానికి ఎంపీపీ సుభద్ర, జెడ్పీటీసీ శారద, అధికారులు పాల్గొన్నారు.



జూన్‌లో వికసించిన

మే పుష్పం

పై ఫొటోలో కనిపిస్తున్న పుష్పం సాధారణ పుష్పం అనుకుంటే పొరపాటే. సంవత్సరానికి ఒకసారి వికసించే మే పుష్పం. వాతావరణంలో చోటు చేసుకొంటున్న మార్పుల కారణమో లేక ఎండల ప్రభావమో కానీ మే నెలలో వికసించాల్సిన పుష్పం జూన్‌లో వికసించింది. కాటారం మండలం దేవరాంపల్లిలో దావు రాంరెడ్డి ఇంట్లో ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా పదికి పైగా మే పూలు ఒకేసారి వికసించి చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

- కాటారం

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

కాటారం: వానాకాలం సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. రైతులు లైసెన్స్ కల్గిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తన కొనుగోలు సమయంలో తప్పకుండా రసీదును తీసుకోని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు. రైతులు గత అనుభవాలను దృష్టిలో వుంచుకొని విత్తన ఎంపిక, మొత్తం సాగు విస్తీర్ణం ఒకే రకం విత్తనంతో కాకుండా అనుకూలతను బట్టి విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. గుడ్డ సంచులలో, విడిగా అమ్మే విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు. కలుపు మందు, గ్లైఫోసెట్ తట్టుకొని పెరిగే పత్తి విత్తనాల సాగుకు అనుమతి లేనందున రైతులు సాగు చేయవద్దని పేర్కొన్నారు. వరిసాగు విషయంలో ముఖ్యంగా దీర్ఘకాలిక రకాలు మే 25 నుంచి జూన్ 5, మధ్యకాలిక రకాలు జూన్ 15లోపు, స్వల్పకాలిక రకాలను జూన్ 25లోపు నారుమళ్లు పోసుకోవాలని వివరించారు. దీంతో వరికోతలు అక్టోబర్ నుంచి నవంబర్ మొదటి వారము లోపు ముగుస్తాయని అన్నారు. రైతులకు విత్తన కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన వ్యవసాయ శాఖ ఫిర్యాదు చేయాలని సూచించారు.

పార్కింగ్ టెండర్‌కు గ్రామ పంచాయతీ అబ్జక్షన్!

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయానికి వచ్చే వాహనాల పార్కింగ్ టెండర్‌ను దేవస్థానం అధికారులు శుక్రవారం నిర్వహించాల్సి ఉండగా గ్రామ పంయాతీ నుంచి అబ్జక్షన్ వచ్చినట్లు తెలిసింది. గ్రామ పంచాయతీ అధికారులకు, పంచాయతీ పాలక వర్గానికి సమాచారం లేదని, పార్కింగ్ టెండర్ ఎలా నిర్వహిస్తారని ఈఓతో మాట్లాడి నిలిపివేసినట్లు సమాచారం. కాగా, కాళేశ్వరం దేవస్థానం అధికారులు టెండర్ నిర్వహణ కోసం పత్రిక ప్రకటన ఇచ్చి, దరఖాస్తులు తీసుకొని సీల్డు టెండర్‌కు రూ.250 ఫీజు చెల్లించారు. ఫీజు చెల్లించిన ఆశవహుకులు దేవస్థానం, పంచాయతీ తీరుతో అసహనానికి గురయ్యారు. గ్రామపంచాయతీ తరుపున త్వరలో పార్కింగ్ టెండర్ వేయనున్నట్లు కూడా ప్రచారం సాగుతుంది. దేవస్థానం తరుపున ఒక వేళ టెండర్ నిర్వహిస్తే ఎంట్రీఫీజు కింద పంచాయతీకి, దేవస్థానానికి ఎలా చెల్లిస్తారని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమస్య కొలిక్కి వస్తే తప్ప పార్కింగ్ వేలం జరిగేటట్లు లేదు. పంచాయతీ టెండర్ కోసం కలెక్టర్, డీపీఓలు సర్క్యులర్ జారీ చేయాల్సి ఉంటుంది. ఇప్పట్లో టెండర్ జరుగదని, త్వరలో దేవస్థానం టెండరే ఖరారు అవుతుందని చర్చ జరుగుతుంది. రెండు శాఖల మధ్య సమస్వయ లోపం కొట్టచ్చినట్లు కనిపిస్తుంది. తాత్కాలికంగా టెండర్‌వాయిదా వేస్తున్నట్లు ఈఓ, పాలకమండలి నిర్ణయించారు.

కొండ గొర్రె మాంసం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మాంసాన్ని చూపుతున్న ఫారెస్ట్ అధికారులు

మల్హర్: మండలంలోని కొయ్యూరు అటవీ రేంజ్ పరిధిలో కొండ గొర్రె మాంసాన్ని ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పెద్దతూండ్ల గ్రామంలోని గాదెంపల్లికి చెందిన రవీందర్.. శాత్రాజ్‌పల్లి అటవీ ప్రాతంలో కొండ గొర్రెను విద్యుత్ తీగలతో వధించి మాంసం విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్కడి చేరుకుని మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రవిపై కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు కొయ్యూరు రేంజర్ కిరణ్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. డిప్యూటీ రేంజర్ కొమురయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఇంతియాజ్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో గొర్రెలు మృతి

భూపాలపల్లి రూరల్: అధికారుల నిర్లక్ష్యంతో గొర్రెలు మృతి చెందినట్లు గొర్రెల రెండవ విడత లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు గొర్రెలను తీసుకువస్తున్న క్రమంలో రవాణాలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన 09 గొర్రెలు మృతి చెందినట్లు గ్రామాల్లో లబ్ధిదారులు తెలుపుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. భూపాలపల్లి మండలం గుడాడుపల్లి గ్రామంతో పాటు, పుల్లూరు రామయ్యపల్లి గ్రామాలకు 18గొర్రెల యూనిట్ల మంజూరు కాగా, 5 యూనిట్లు గుడాడుపల్లికి, 13 యూనిట్ల గొర్రెలు పుల్లూరు రామయ్య పల్లికి వేర్వేరుగా వాహనాల్లో తరలించారు. గుడాడుపల్లి గ్రామానికి తరలిస్తున్న వాహనానికి వెంటిలేషన్ సౌకర్యం లేకపోవడంతో గొర్రెలకు ఊపిరాడక ఐదు యూనిట్లలో 9 గొర్రెలు మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పశుసంవర్ధక శాఖ అధికారులు అస్వస్థకు గురైన మరి కొన్ని గొర్రెలను కాపాడినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. గొర్రెల మృతిని ఉన్నతాధికారులకు తెలపకుండా అధికారులు గోప్యంగా ఉంచినట్లు సమాచారం. నష్టాన్ని తమపై మోపుతున్నారని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ఈ గొర్రెల యూనిట్ల తరలింపు అవగాహన లేని వారికి అప్పగించడం వల్లనే మృత్యువాత పడినట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ అధికారులు స్పందించి తమకు నష్ట పరిహారం అందించి న్యాయం జరిగే విధంగా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా పశు సంవర్ధక అధికారి రంగారావును వివరణ కోరగా.. గొర్రెలమృతిపై విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.

వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చిట్యాల: ప్రతి వాహనదారులు లైసెన్స్‌ను కలిగి ఉండాలని సీఐ వేణుచందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద ఎస్సై ఎండీ షాఖాన్‌తో కలిసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వారి వద్ద లైసెన్స్ కాగితాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారుడు హెల్మెంట్ ధరించాలని కోరారు. చిన్న పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వకూడదని తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని సూచించారు. మండలంలోని గ్రామాలలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం 11మంది వాహదారులకు సరైన పత్రాలు లేకపోవడంతో జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్, శ్రీధర్, పులి అశోక్, ప్రశాంత్‌రెడ్డి, రంజీత్, తదితరులు ఉన్నారు.

'దశాబ్ది ఉత్సవాలతో ఒరిగేది లేదు'

ఏటూరునాగారం: దశాబ్ది ఉత్సవాలతో ప్రజలకు ఒరిగేది ఏమిలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాలనలో ఏ రంగం బాగుపడలేదన్నారు. కేసీఆర్ కుటుంబం తప్ప ఏ కుటుంబం సంతోషంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ఉపాధ్యక్షుడు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, ఉప సర్పంచ్, మండల మహిళా అధ్యక్షురాలు కర్ల అరుణ, మధుబాబు, రియాజ్, రామయ్య, సత్యం, వినయ్ కుమార్, రవి, సులేమాన్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక జిల్లా పరిషత్ పాఠశాలలో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలకు సంబంధించిన విద్యాశాఖ పోస్టర్లను జెడ్పీటీసీ పాయం రమణ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దశాబ్ది వేడుకల్లో పది సంవత్సరాలుగా విద్యాశాఖలో జరిగిన అభివృద్ధిపై వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి, సీఆర్‌పీ రాజారావు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రమేష్ ఉన్నారు.

ప్రమాదవశాత్తు తాటివనం దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రంలోని తాటివనంలో శుక్రవారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని తాటివనం దగ్ధమైంది. సుమారు 50కి పైగా తాటి చెట్లు అగ్నికి ఆహుతి కాగా సమాచారం అందుకున్న సర్పంచ్ ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. వృత్తిపై ఆధారపడ్డ తమకు అగ్ని ప్రమాదంలో తీవ్ర నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మికులు కోరారు. అగ్ని ప్రమాదంపై తక్షణమే స్పందించిన సర్పంచ్, ఎస్సైలను గీత కార్మికులు, గ్రామస్తులు అభినందించారు.